## క్లుప్తంగా

### స్పందన సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలపై అర్జీలను సమర్పిస్తున్న ప్రజలు

**కోడుమూరు రూరల్:** స్పందన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ జయన్న తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించగా, ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలను సమర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనలో భాగంగా ఆయా గ్రామాల రైతుల నుంచి వచ్చే భూ సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు.

### కేసీ కాల్వకు నీటి విడుదల

**గూడూరు:** సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు సోమవారం డ్యాం అధికారులు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని వారు తెలిపారు.

### బూజునూరులో ఎస్‌ఐ పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

**గడివేముల:** మండల పరిధిలోని బూజునూరు గ్రామంలో ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రమే ఎస్‌ఐ గ్రామానికి చేరుకుని ప్రజలతో సమావేశమయ్యారు. వివాదాలకు తావులేకుండా అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలన్నారు. చోరీలు, జూదం, మట్కా, నాటుసారా తదితర అసాంఘిక కార్యకళాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### కొనసాగుతున్న పారిశుధ్య పనులు

**సి.బెళగల్:** మండలంలోని ముడుమాల గ్రామంలో నాలుగు రోజుల క్రితం చేపట్టిన పారిశుధ్య పనులు సోమవారం కొనసాగాయి. గ్రామంలో డెంగీ అనుమానిత కేసులు ఉన్నాయన్న ప్రచారంతో సర్పంచ్ బతుకమ్మ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ వీధుల్లోని మురుగు కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. మురుగునీరు నిల్వలేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మురుగు కాలువల్లో లార్వాను నిరించేందుకు పిచికారీ చేయించారు.

### పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

**కర్నూలు(సెంట్రల్):** మండల పరిధిలోని గొందిపర్ల, పసుపల, బి.తాండ్రపాడు, ప్రజానగర్‌లలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేపీ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ హరిప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు.

### ఫలించిన క్లాప్ డ్రైవర్ల పోరాటం

**కర్నూలు(సెంట్రల్):** 20 రోజులుగా క్లాప్ డ్రైవర్లు చేస్తున్న పోరాటం ఫలించింది. వారి డిమాండ్లకు రెడ్డి ఏజెన్సీ అంగీకరించింది. సోమవారం కార్మిక శాఖ కార్యాలయంలో కార్మిక అధికారి రమణమ్మ ఆధ్వర్యంలో యాజమాన్యం తరఫున మేనేజర్ తన్వీర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఆ సంఘం ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, క్లాప్ డ్రైవర్ల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, షఫీ, అశోక్, రాజేష్ తదితరుల ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో పెండింగ్‌లో ఉన్న పదినెలల వేతనాలు చెల్లించేందుకు రెడ్డి ఏజెన్సీ అంగీకరించింది. అలాగే కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవడంతో పాటు వీక్లీ ఆఫ్ ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించడంతో నేటి నుంచి క్లాప్ డ్రైవర్లు విధులకు హాజరుకానున్నారు.

### రేపటి నుంచి విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు

**కర్నూలు సిటీ:** జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, రెసిడెన్షియల్, మోడల్ స్కూల్, మున్సిపాలిటీ, కస్తూరిబా స్కూళ్లలో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుందరా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లా స్థాయిలో పాత్ర పోషణలో థీమ్స్ 1.ఆరోగ్యంగా ఎదగడం, 2.పోషకాహారం, శ్రేయస్సు, 3. వ్యక్తిగత భద్రత (శారీరక, మానసిక, భావోద్వేగ, లైంగిక), 4.ఇంటర్నెట్, గాడ్జెట్లు, మీడియా, అక్షరాస్యత అంశాలు, జానపద నృత్య రంగంలో 1.అబ్బాయిలు, బాలికలకు సమాన అవకాశం 2. పిల్లల అభివృద్ధిలో ఉమ్మడి కుటుంబం పాత్ర, 3. పర్యావరణ పరిరక్షణ, 4.పదార్థ దుర్వినియోగం నివారణ, 5.కౌమారదశలో ఆరోగ్యకర సంబంధలు అనే అంశాలపై పోటీలు ఉంటాయన్నారు.

# మనసు మాట వినడం లేదు

- పెరుగుతున్న మానసిక వ్యాధి బాధితులు
- కోవిడ్ అనంతరం మరిన్ని సమస్యలు
- 15 శాతం మందికి మానసిక జబ్బులు
- చదువు, సంసారం, ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్యమూ కారణమే
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం

మనసుకు జబ్బు చేసింది...! అవును నిజమే...చెప్పేవారు లేక మనసు తీవ్ర వేదనకు గురవుతోంది. చదువు, సంసారం, ఆర్థిక, ఆరోగ్య సమస్యలూ దీనికి కారణంగా నిలుస్తున్నాయి. ఏ సమస్యలు ఎప్పుడు ఎంతగా వేధిస్తాయోనని ఆందోళన, భయమూ వెంటాడుతున్నాయి. ఫలితంగా ఎప్పుడూ ఏదో కోల్పోయినట్లుగా మనిషి కనిపిస్తున్నాడు. గతంలో లాగా అందరితో కలిసి మాట్లాడలేకపోతున్నాడు. ఒంటరిగా ఉండాలని మనసు చెప్పడంతో ఎవ్వరి వద్దకూ వెళ్లడం లేదు. ఎందరికో వేధిస్తున్న ఈ మానసిక వ్యాధికి చికిత్స అవసరం. ఈ నెల 10వ తేదీన 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం' సందర్భంగా ప్రత్యేక కథనం.

**కర్నూలు(హాస్పిటల్):** ఇప్పటికీ మానసిక వైద్యుడు (సైక్రియాట్రిస్ట్) వద్దకు వెళ్లాలంటే చాలా మందికి ఒక విధమైన నామోషి. నాకేమైనా పిచ్చి ఉందనుకున్నావా అని ఎదురు ప్రశ్నిస్తారు. పిచ్చి పట్టిన వారినే సదరు డాక్టర్ వద్దకు తీసుకెళ్తారని నమ్మే వారు ఇప్పటికీ చాలా మందే ఉన్నారు. పిచ్చిగా ప్రవర్తించడమే కాదు పలు రకాల ఆరోగ్య సమస్యలకు మానసిక ఆరోగ్యమే కారణమని వైద్యులు చెబుతున్నారు. దీనిపై అవగాహన ఉన్న వారు మాత్రమే వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. జిల్లాలో పాతికేళ్ల క్రితం ఒకరిద్దరు మాత్రమే సైకియాట్రిస్టులు ఉండేవారు. ప్రస్తుతం కర్నూలు నగరంతో పాటు నంద్యాల, ఆదోని, డోన్‌లలో 30 మంది దాకా సైకియాట్రిస్టులు ఉన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వ్యాధుల విభాగం ఓపీకి ప్రతిరోజూ 80 నుంచి 100 మంది వరకు చికిత్స కోసం వస్తుండగా , ఇన్‌పేషంట్లుగా 25 మంది దాకా ఉంటున్నారు. ఓపీ చికిత్స కోసం వచ్చేవారిలో 60 శాతం మంది కొత్తవారు ఉండటం గమనార్హం. ప్రైవేటుగా చికిత్స చేసే వైద్యుల వద్దకు సైతం ఒక్కొక్కరి వద్దకు రోజూ 20 నుంచి 50 మంది వరకు వెళ్తున్నారు. వైద్యుల వద్దకు వెళ్తున్న వారిలో ఎక్కువగా స్కిజోఫీనియా, మానియా, డిప్రెషన్, అతిగా మద్యపానం, మత్తు పదార్థాలు సేవించడం, ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం, గృహహింసలతో బాధపడేవారు ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. వారిలో ఉన్న లక్షణాల ఆధారంగా కౌన్సెలింగ్, మందుల ద్వారా వైద్యులు నయం చేస్తున్నారు.





కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వ్యాధుల ఓపీ విభాగం



వివరాలు తెలుసుకుంటూ చికిత్స చేస్తున్న వైద్యులు

**పెద్దాసుపత్రిలో ఐదేళ్లలో ఓపీ రోగుల సంఖ్య**

| సంవత్సరం | ఓపీ రోగుల సంఖ్య |
|---|---|
| 2019 | 20,054 |
| 2020 | 13,365 |
| 2021 | 15,942 |
| 2022 | 19,475 |
| 2023 | 18,898 |

### మానసిక ఒత్తిడి వల్లే అనారోగ్యం

మానసిక ఒత్తిడి వల్ల కడుపులో గ్యాస్ (వాయువు), ఆవేశకావేశాల వల్లే అధిక రక్తపోటు, అతిబద్ధకం వల్ల చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా పెరగడం, అధిక స్వార్థం, మొండితనం వల్ల డయాబెటీస్(మధుమేహం),అతి విచారం వల్ల ఆస్తమా, ప్రశాంతత లో పించడం వల్లే గుండెకొట్టుకోవడంలో మార్పులు వస్తున్నాయని ఇటీవల వైద్యులు గుర్తించారు. మొత్తంపై శరీరంలో వచ్చే సర్వరోగాలకు మూలకారణాలు తరచి చూస్తే ఆహార అలవాట్లతో పాటు అధికశాతం జీవనశైలి సంబంధమైనవేనని తెలుస్తోంది.

### మానసిక వ్యాధి లక్షణాల్లో కొన్ని..

- ఆందోళన, భయం, గుండెదడ, అధికంగా చెమటలు పట్టుట, కాళ్లు, చేతులు వణుకుట
- అనవసర ఆలోచనలు మళ్లీ రావడం, అనవసర పనులు మళ్లీ మళ్లీ చేయడం
- చేతులు అదే పనిగా కడగటం, విచారంగా ఉండటం, పనిలో ఉత్సాహం లేకపోవడం
- ఆకలి, నిద్రలేకపోవడం, ఆత్మహత్యాలోచనలు, మతిమరుపు,జ్ఞాపకశక్తి తగ్గుట, ప్రవర్తనలో మార్పు
- ఇతరులను అనుమానించడం, భర్త లేక భార్య శీలాన్ని శంకించడటం
- కలత నిద్ర, నిద్రపట్టకపోవడం, నిద్రలో నడవటం, మాట్లాడటం, మూత్రవిసర్జన చేయడం, భయంకర కలవరింతలు, అతినిద్ర, నిద్రలో పళ్లు కొరకడం
- నిగ్రహశక్తి కోల్పోవడం, జూదానికి బానిస కావడం, పరుల వస్తువులను దొంగిలించడం, అదే పనిగా షాపింగ్ చేయడం.

### నిత్యం ఉల్లాసంగా గడపాలి

ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేవారు ప్రశాంతమైన మూడ్‌లో ఉండేందుకు నచ్చిన పాటలు వినాలి. వాకింగే కాదు ఉల్లాసంగా ఉండేందుకు ఏం చేస్తే బాగుంటుందో అదే చేయాలి. కొందరు వాకింగ్ ఇష్టపడితే మరికొందరు జిమ్‌కు వెళ్లాలంటున్నారు. ఇంకొందరు యోగా, ధ్యానాన్ని ఇష్టపడతారు. అందుకని డాక్టర్లు పేషంట్ల ఇష్టానికే విడిచిపెట్టి ఎంతో కొంత వ్యాయామం మాత్రం చేయాలని సూచిస్తున్నారు. అలాగే పది మంది కలిసి నిత్యం ఉల్లాసంగా ఉండే విధంగా చూసుకోవాలి. వీలైనప్పుడల్లా విహార యాత్రలు చేయాలి. నచ్చిన సినిమాలు చూడాలి. కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడిపే విధంగా చూసుకోవాలి.

### యువతలో పెరుగుతున్న మానసిక సమస్యలు



ఇటీవల కాలంలో యువతలో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. ఆర్థిక సమస్యలతో పాటు నిరుద్యోగం, జీవితంలో స్థిరపడలేకపోవడం, వివాహం కాకపోవడం, సోషల్ నెట్‌వర్క్, కుటుంబసభ్యులతో సఖ్యత లేకపోవడం వంటి కారణాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇతరుల్లో మానసిక ఆరోగ్య సమస్యలకు ఒక కారణమంటూ చెప్పలేము. వారి వారి సమస్యలను బట్టి కారణాలు నిక్షిప్తమై ఉంటాయి. ఇటీవల కాలంలో స్త్రీలలో డిప్రెషన్ అధికమైంది. దానికి ప్రధానంగా కుటుంబ సమస్యలే కారణం.

–డాక్టర్ నాగేశ్వరరావు, మానసిక వ్యాధుల విభాగాధిపతి, పెద్దాసుపత్రి, కర్నూలు

### హోమియోతో పాటు సైకోథెరపి చికిత్స



స్త్రీలలో హార్మోన్ల అసమతుల్యత, పోస్టు ట్రమాటిక్ డిజార్డర్ల వల్ల మానసిక సమస్యలు అధికమవుతున్నాయి. పెద్దలలో యాంగ్జైటీ, డిప్రెషన్, పిల్లల్లో ప్రాథమిక దశల్లో వచ్చే ఆటిజం, ఏడీహెచ్‌డీ లాంటి మానసిక రుగ్మతలలో మానసిక, భౌతిక, ఫ్యామిలీ హిస్టరీలను క్రోడీకరిస్తూ హోమియోపతి మందులతో పాటు సైకోథెరపీ ద్వారా ఇచ్చే చికిత్సలు ఎంతో ప్రభావంతమైన ఫలితాలు ఇస్తాయి. వీటితో పాటు కౌన్సిలింగ్, బిహేవియర్, మాడిఫికేషన్ థెరపీలు ఎంతో బాగా పనిచేస్తాయి.

–డాక్టర్ విద్యాసాగర్‌రావు, హోమియో వైద్యులు, సైకాలజిస్టు, కర్నూలు

# సురక్ష శిబిరాలతో ప్రజల వద్దకే వైద్య సేవలు

**కోడుమూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని ముడుమల గుర్తి గ్రామంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంపును తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించడంతో పాటు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. భవిష్యత్‌లో ప్రజలెవరూ జబ్బులతో బాధపడకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జయంతి, నస్రీన్, మదన్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ముడుమలగుర్తిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపుకు ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. శిబిరానికి సుమారు 300 మందికిపైగా ప్రజలు తరలివచ్చి ఆరోగ్య స్థితిగతులపై పరీక్షలు చేయించుకోగా, వైద్య సిబ్బంది వారికి ఉచితంగా మందులను అందజేశారు.





ముడుమలగుర్తిలో వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్ , సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి హెల్త్ క్యాంప్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

### గొల్లలదొడ్డి గ్రామంలో..

**సి.బెళగల్:** మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ మిధున్‌కుమార్ రెడ్డితోపాటు ప్రత్యేక వైద్యులు శ్రావణి, శరత్, కేదార్‌నాథ్‌గౌడ్, సంపత్, ఉమామహేశ్వరమ్మ, మంగమ్మ, ఆదినారాయణ తదితరులు ప్రజలకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ రామలింగమ్మ, సచివాలయ కన్వీనర్ లోకేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

**గుండె పరీక్ష చేశారు**



కొంచెం ఆయాసం ఉండేది. మా గ్రామంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో ఇక్కడికి వచ్చాను. బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు జ్వరం చెక్ చేశారు. ఆయాసం ఉందని మిషన్ మీద పడుకోబెట్టి వైర్లు బిగించి పరీక్ష(ఈసీజీ) చేశారు. మందులు ఇచ్చారు. కర్నూలుకు రమ్మన్నారు. అక్కడ కూడా ఉచితంగానే వైద్యం చేస్తారంటా.

– బాల వెంగన్న, ఒండుట్ల గ్రామం

### ఒండుట్లలో..

**గడివేముల:** మండల పరిధిలోని ఒండుట్ల పాఠశాల ఆవరణంలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ కాలునాయక్, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ప్రారంభించారు. డాక్టర్ చిన్న మద్దిలేటి ఆధ్వర్యంలో పలువురు వైద్యులు 611 మందికి ఏడు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద వివిధ కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. వైద్య శిబిరంలో వైస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డి, సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ జయలక్ష్మి, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## 'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

**కర్నూలు సిటీ:** జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ఆఫీసర్ డాక్టర్ హేమలత సూచించారు. మండలంలోని పడిదెంపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. వైద్య సేవలను, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులు, రక్తపోటు, షుగర్, క్యాన్సర్లపై ఫ్లిప్ బుక్ ద్వారా అవగాహన కల్పించారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందించే సేవల గురించి, వైద్యసేవలు ఎలా పొందాలో, ఏఏ ఆసుపత్రులకు వెళ్లాలో, ఏయే రకాల జబ్బులకు చికిత్స చేస్తారనే విషయాలను సైతం వైద్య శిబిరాలలో వివరించాలన్నారు. 18 నుంచి 22 వారాల గర్భిణులకు ప్రభుత్వ ఖర్చుతో చేయనున్న టిఫా స్కానింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు అశ్విని కుమార్, ఎస్‌వీ రామమోహన్‌రెడ్డి, జయలక్ష్మి, విజయ, ముఖ్తర్ పాషా, ఏంపీహెచ్‌ఈఓ వెంకటరమణ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ హేమలత

### నేడు గొల్లలదొడ్డిలో వైద్య శిబిరం

**సి.బెళగల్:** మండలపరిధిలోని కొండాపురం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. ప్రత్యేక వైద్యులు హాజరై ఉచితంగా వైద్యం చేసి, మందులు అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కర్నూలు సిటీ:** కర్నూలు–గుంటూరు రహదారి విస్తరణ పనుల నిమిత్తం మిలటరీ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎస్‌పీడీసీఎల్ కర్నూలు రూరల్ ఏఈ ఆంజనేయశాస్త్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజ్ ఫీడర్‌కు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనుండటంతో నందనపల్లె, సుది రెడ్డి పల్లి, వెంకాయపల్లి పరిధిలోని వెంచర్లకు, జి.పుల్లయ్య కాలేజీ ఏరియాలకు అంతరాయం కలుగుతుందన్నారు. మిలటరీ కాలనీ అగ్రికల్చర్ ఫీడర్‌కు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంగలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

### ముడుమాల మాజీ సర్పంచ్ మృతి



రామకృష్ణారెడ్డి (ఫొటో)

**సి.బెళగల్:** మండల పరిధిలోని ముడుమాల గ్రామ మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి (98) వృద్ధాప్య సమస్యలతో సోమవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి 1995లో సర్పంచ్‌గా ఎన్నికై గ్రామానికి సేవలు అందించారు. అలాగే కొండాపురం వ్యవసాయ పరపతి సంఘం (సింగల్ విండో) అధ్యక్షుడిగా సేవలందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

### గుండెపోటుతో గ్రామ వలంటీర్ మృతి



రాణాప్రతాప్(ఫొటో)

**సి.బెళగల్:** మండల పరిధిలోని పోలకల్ గ్రామ వలంటీర్ రాణా ప్రతాప్ (29) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఎస్సీ కాలనీలో నివాసముండే రాణా ప్రతాప్ సోమవారం మధ్యాహ్నం పొలం పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. అసటుగా ఉండటంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. అక్కడే గుండెపోటు రావడంతో కుప్పకూలి ప్రాణాలొదిలాడు. మృతుడికి భార్య చిన్నారి, ముగ్గురు కుమారులు ఉన్నారు. సచివాలయ ఉద్యోగులు, సహచర వలంటీర్లు మృతుడి ఇంటికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

## దేవి నవరాత్రుల ఆహ్వాన పత్రికలు విడుదల

**కోడుమూరు రూరల్:** పట్టణంలో వెలసిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ దేవి శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికలను సోమవారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు యుగంధర్ శెట్టి మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 23 వ తేదీ వరకు అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 9రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, ప్రజలంతా ఆహ్వానితులేనన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కిరణ్, అశోక్, కిశోర్, మురళీకృష్ణ, హరిమోహన్, రవీంద్ర, నరసింహయ్య, రవిప్రకాష్, మల్లికార్జున, శశిధర్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

## ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎంఈఓలు

**సి.బెళగల్:** మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేసి ఇటీవల పదోన్నతి, బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను ఎస్టీయూ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషాలతో పాటు ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోకారి, మండల అధ్యక్షుడు ఈశ్వరప్ప, కార్యదర్శులు సాలన్న, గోవిందునాయక్, దేవదాసు హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు.

## బాలికల విద్యకు షేక్ ఫాతిమా ఎనలేని కృషి



పూలే, సావిత్రీబాయి, షేక్ ఫాతిమా విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**గూడూరు:** బాలికల విద్యకు షేక్ ఫాతిమా ఎనలేని కృషి చేశారని బీసీ, ఎస్సీ, మైనార్టీ సంఘాల ప్రతినిధులు అన్నారు. సోమవారం మండలంలోని బూడిదపాడు ఎంపీ యూపీ పాఠశాల ఆవరణంలో షేక్ ఫాతిమా విగ్రహంతో పాటు అనగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఇంటలెక్చువల్ కలెక్టివ్ సంస్థ జిల్లా కన్వీనర్ ఖదీరుల్లా ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, మైనార్టీ సంఘాల ప్రతినిధులు నక్కల మిట్ల శ్రీనివాసులు, పట్నం రాజేశ్వరి, ఇనయతుల్లా, అబ్దుల్ రజాక్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రచయిత ఎస్‌డీవీ అజీజ్, నంద్యాల మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నిరంజన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓపీ శాతం పెంచండి

**కర్నూలు(సెంట్రల్):** జగనన్న ఆరోగ్యసురక్ష మెడికల్ క్యాంపుల్లో ఓపీ(అవుట్ పేషెంట్) శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండలాధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె క్యాంపు కార్యాలయం నుంచి వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులతో మాట్లాడారు. పెద్దకడబూరు, హోళగుంద, కృష్ణగిరి, కౌతాళం, కోసిగి మండలాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నెమ్మదిగా కొనసాగుతోందని, బుధవారంలోపు సర్వేను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. తక్కువ శాతం ఓపీని జనరేట్ చేసిన మండలాల ఎంపీడీఓలకు షోకజ్ నోటీసులు ఇవ్వాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని ఆదేశించారు. కర్నూలు, మంత్రాలయం రూరల్, కౌతాళం, గూడూరు మండలాల్లో జీరో టోకెన్లను జనరేట్ చేశారని, అందుకు కారణాలు చెప్పాలని ఎంపీడీఓలను ప్రశ్నించారు. ఈ క్రాప్ నకు సంబంధించి మంగళవారం సాయంత్రంలోపు వంద శాతం ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. అలాగే జగనన్న కాలనీల్లోఈ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదనరావు, సీపీఓ అప్పలకొండ, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు పాల్గొన్నారు.

### ఎఫ్‌డీపీపై అవగాహన సదస్సు

**పాణ్యం:** మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఎఫ్‌డీపీపై ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శాంతిరాముడు, డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 13న రైఫిల్ షూటింగ్ పోటీలు

**కర్నూలు (టౌన్):** ఈనెల 13 న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక అశోకనగర్‌లోని ఆర్‌కే అకాడమీలో అండర్–14, అండర్–17 విభాగంలో బాల బాలికలకు రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ ఇన్‌చార్జ్ రవి కుమార్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8464815130ను సంప్రదించాలని తెలిపారు.